అమృత్‌కిరణ్ కథలపోటీలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ (250/-)

# అసలు నిజం

ఐతా చంద్రయ్య


**మా** ఊరి పోస్టుమాస్టర్ నాకు బాగా తెలుసు. ఉత్తరాలు కొనుక్కుని అతన్తో మాట్లాడుత్తూ కూర్చున్నాను.

*ఎవరో ఒక వ్యక్తి... గాలికి కదిలే టేకు ఆకులా పదునైన నిక్కరూ, శరీరానికతుక్కుపోయిన షర్టూ, పెరిగిన గడ్డంతో*

నో అడ్మిషన్ బోర్డును లెక్కచేయకుండా లోపలికి చొచ్చుకొచ్చాడు.

ఎగాదిగా చూశాడు పోస్టుమాస్టరతన్ని. అంతేకాదు. అతడందించిన తెల్లకాగితమ్మీద పోస్టాఫీసు ముద్రవేసి ... "ఇదిగో రఘువీర్... ఇక వెళ్ళు" అంటూ ఇచ్చేశాడు.

నా గుండె ఝుల్లుమంది. తెల్లకాగితమ్మీద ముద్రవేయడమంటే బ్లాంకు చెక్కుమీద సంతకం బెట్టడమే గదా! అతడి వాలకం నాలో ఆసక్తి రేకెత్తించింది. మారు మాట్లాడకుండా రఘువీర్ వెంట వెళ్ళాను. కో ఆపరేటివ్ బ్యాంకులో దూరాడతడు.



అదే కాగితమ్మీద కో ఆపరేటివ్ బాంకు మేనేజర్ సంతకం చేసిచ్చాడు.

అక్కణ్ణుంచి గబగబా స్టేట్ బ్యాంకులోకి... స్టేట్ బ్యాంకు క్యాషియర్ రామారావు సదరు కాగితాన్నందు కుని ఒక రూపాయి బిళ్ళ రఘువీర్ చేతుల్లో ఉంచాడు.

ఖుషీగా గడ్డం నిమురుకుంటూ వెళ్ళిపోయాడు రఘువీర్. క్యాషియర్ రామారావు నా ప్రాణ స్నేహితుడు.

"ఇదేం తమాషారా?" అడిగాను.

"వాడో పిచ్చోడురా. రోజూ పోస్టాఫీసు ముద్రా, కో ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ సంతకంతో కాయితం తెచ్చిచ్చి రూపాయి వసూలు చేసుకెళ్తాడు. ఈ మూడు ఆఫీసుల్లో ఎవరైనా కాదూ, కూడదూ అంటే ఆ ఆఫీసులో హంగామా! ఆఫీసు రికార్డులు చెల్లాచెదరై పోతై. గొడవ జరిగిపోతుంది. ఫోన్ చేస్తే పోలీసులు కేర్ చెయ్యరు. ఎందుకొచ్చిన గొడవాని అందరమూ అడ్జెస్టైపోయాం."

★ ★ ★

ఎదురు చూస్తోన్న ప్రమోషన్ పైరవీ లేకుండా వచ్చినందుకు - లక్ష రూపాయల లాటరీ తగిలినంత సంతోషమైంది. ఆఫీసు స్టాఫుకు యస్కేసి (స్వీటు, కారా, కాఫీ) సమర్పించుకుని ఇంటికొచ్చా.

మానససరోవరంలో రాయంచలా వయ్యారంగా అడుగులేస్తూ ఎదురొచ్చిందది నా శ్రీమతి మనోరమ.

"శ్రీవారి ముఖపద్మమీరోజు సెర్చిబల్బ్ లా వెలిగిపోతుందేమిటి?" భుజమ్మీద చెయ్యేసి గది లోకి ఫాలో అయింది.

డ్రెస్ మార్చుకోవడంలో సంపూర్ణంగా సహకరిస్తూ నా ఉద్యోగపర్వంలో విజయకేతనం రెపరెపల గురించి వింది. విని సంతోషాన్నాపుకోలేక అమాంతం కౌగిలించుకుని నా చెంపల్ని పెదాలతో తడిపేసింది.

"అబ్బా... ఇద్దరు పిల్లల తర్వాత నీ అందం ఐదు రెట్లు పెరిగింది మనోరమా!" దొండపండు పెదాలందుకోబోయాను. అరచేత్తో నా పెదాలనాపేసి

"ఇప్పటికిది చాలు... పిల్లలు వచ్చే వేళైంది." కాటుక కళ్ళను చక్రాల్లా తిప్పేసింది.

"అదేం కుదరదూ..." విజృంభించబోయాను.

"ఎవరూలేరా ఇంట్లో..." అంటూ రామారావొచ్చాడప్పుడే. వీడిప్పుడే రావాలా...

మనోరమ గబగబా వెళ్ళి నా ప్రమోషన్ వార్త వాడి చెవిలో వేసింది- ఆలస్యమైతే కొంపలంటుకు పోతాయన్నట్టు.

"ఏరా మిత్ర ద్రోహీ! ఈ వార్తనిప్పటి దాకా దాచావు. ఏం బావుకుందామనుకున్నావురా?..." నిలదీశాడు.

"అంతేకాదు... వాడికీ రోజు కూడు బెట్టకు చెల్లెమ్మా!" అంటూ ఆదేశాలు గూడా జారీచేశాడు.

"నిన్ను మీ ఆఫీసులో కలిసి నేను మా ఆఫీసు కెళ్ళింతర్వాతనే ఈ వార్త తెలిసిందిరా... అమ్మతోడు..." నా నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవాల్సి వచ్చింది.

ప్రమోషన్ ఉద్యోగంలో జాయినయ్యే ముందు జబల్పూర్‌లో మూడు నెలల ట్రెనింగ్. ఎల్లుండే ట్రెనింగ్ క్లాసులో రిపోర్టు చెయ్యాలి. ఆర్డర్ చదివి...

"ఐతే... పదా సిన్మాకు. మనం మళ్ళీ కలిసి సినిమా చూసేదెప్పుడో...!" అని సిన్మాకి లాక్కెళ్ళాడు.

సినిమా వదిలేసరికి తొమ్మిదైంది. సంగీతం, సాహిత్యం, నాట్యం సమపాళ్ళలో రంగరించిన రసగుళిక సినిమా గురించి చర్చిస్తూ భోగేశ్వరాలయం దాకా వచ్చాం.

పదిహేను నెలల క్రితం భోగేశ్వరాలయంలో జంటహత్యలు జరిగాయి. అందుకే రాత్రి సమయాల్లో ఆ రూట్లో ఎవ్వరూ నడవరు. కాని మా ఇళ్ళకదే షార్ట్‌కట్. గబగబా నడుస్తున్నాం.

పున్నమి రోజది. పచ్చిపాలు ఆరబోసినట్టు తెల్లని వెన్నెల. కాకతీయుల కళాతృష్ణకు అద్దం పడుతున్న దేవాలయ ప్రాకారాలను మెరిపింపచేస్తున్న ఆ శుభ్రజ్యోత్స్న కాంతులకు వీధిలైట్ల వెలుగులు వెలవెలబోతున్నై.

విచిత్రం... దేవాలయంలోంచి వస్తోన్న సుమధుర సంగీత రవళి మా చెవులకు ఇంపుగా సోకింది. కాళ్ళకు బ్రేకులు పడినై. అప్రయత్నంగా లోపలి కెళ్ళాం.. ఆశ్చర్యం... అద్భుతం.

చల్లని వెన్నెలలో విశాలమైన మంటపమ్మీద కాలుమీద కాలేసుకుని పడుకున్న రఘువీర్ గొంతెత్తి సంగీత సరస్వతికి నీరాజనాలర్పిస్తున్నాడు.

మమ్మల్ని చూడగానే దిగ్గున లేచి కూచున్నాడు.

"నువ్వా రఘువీర్...!? ఐతే... నువ్వు పిచ్చాడివి కావన్నమాట!" అడిగాడు రామారావు ఉద్వేగంగా.

రఘువీర్ శూన్యదృక్కులు ఆకాశంవైపు




పూర్తిపేరు : ఐతా చంద్రయ్య
జన్మ స్థలం : చింతపాడు గ్రామం, సిద్ధిపేట మండలం
వృత్తి : తపాలా శాఖలో పబ్లిక్ రిలేషన్ ఇన్‌స్పెక్టర్.
(సిద్ధిపేట ప్రధాన కార్యాలయంలో)


1986 లో జాగృతి కవితల పోటీలో, 1987 లో జాగృతి మినీ కథల పోటీలో, 1988 జాతీయ విప్లవజ్యోతి కావ్యానికి (వేముగంటి సాహితీ పురస్కార ప్రదానం) 1989లో సాధన కథల పోటీలో, 1991లో జలధి కథల పోటీలో బహుమతులు లభించాయి.

కవితలు ఆరు, కథా సంకలనాలు ఐదు, నాటిక ఒకటి, నవల ఒకటి, ప్రచురింపబడ్డాయి. కొన్ని కవితలూ, కథలూ, నాటికలూ డియోలో ప్రసారమయ్యాయి.

నా కథకు కన్సోలేషన్ బహుమతి నిచ్చినందుకు ఎడిటర్ గారికి కృతజ్ఞతలతో.


-ఐతా చంద్రయ్య,
ఇ.నం.4-4-11, శేర్‌పురా,
సిద్ధిపేట - 502 103.

మళ్ళినై.

"హేయ్ రామ్!" గట్టిగా ఊపిరి వదుల్తూ స్తంభాని కొరిగాడు.

"మీరెవరు?... ఈ ఊళ్ళో ఎందుకుంటున్నారూ?" అడిగాను ఆసక్తిగా.

మా వైపు మళ్ళిన అతని దృష్టి వెనక ఎన్నో అగాధాలున్నట్టనిపించింది.

ఇద్దరం కూచుండిపోయాం.

"నా సంగతి మీకెందుకూ?" అన్నట్టుగా చూశాడు.

"ప్లీజ్ చెప్పండి. మీకు పిచ్చిలేదు గదూ!" అభ్యర్థనగా అడిగాడు రామారావు.

"పూర్వం మాదీవూరే బాబూ!" రఘువీర్ గొంతులో గాంభీర్యం...

"నరరూప రాక్షసులైన రజాకార్ల చిత్రహింసలను భరించలేక మా తాత, నాన్నలీ ఊరిడిచి కాశ్మీర్ వెళ్ళారు. నేనప్పుడు చిన్నపిల్లవాణ్ణి. అదివరకే కాశ్మీర్లో స్థిరపడిన మా బంధువుల సహాయంతో మా నాన్న చిల్లరకొట్టు పెట్టాడు.

కాశ్మీర్ మహారాజు పుణ్యమాని అక్కడి ప్రజల్తో మేమూ కుదురుగున్నకు కొదవలేకుండా గడిపాం. తాత మరణించాడు. కాశ్మీర్ భారత్‌లో విలీనమైంతర్వాత మా కష్టాలు ప్రారంభమైనై. పాకిస్తాన్ మానసపుత్రుల ఆగడాలెక్కువైనై.

ఒకే వర్గంవారి ఇళ్ళమీద దాడులు, దొంగతనాలు ఎక్కువైనై. మా వర్గంవారు దోపిడీలకు గురైనారు. రాను రాను అత్యాచారాలు, మానభంగాలు నిత్యకృత్యాలైపోయినై.

ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని రోజులు గడుపుతున్నా తీవ్రవాద రాకాసి మూకలు పట్టపగ్గాలు లేకుండా విజృంభించాయి. పట్టపగలు నడిబజార్లో హత్యలు, చిత్రహింసలు, గృహదహనాలు మామూలైనై.

అంతెందుకూ... కాశ్మీర్ లోయలో మన త్రివర్ణ పతాక మెగరదు. అసలక్కడ మమ్మల్ని ఆదుకునే నాథుడేలేడు. లక్షలాది మంది గాయాలతో ఆస్తిపాస్తులొదిలేసి పారి పొయ్యొచ్చారు. ఢిల్లీపేవ్‌మెంట్ల మీద అడుక్కు తింటున్నారు. పోలీసుల లాఠీదెబ్బలు భరించలేక ఎటెటో పారిపోతున్నారు.

ఓరోజు... మా ఇంటిమీద దాడి జరిగింది. మా నాన్న కాళ్ళు చేతులు నరికేశారు. నా కళ్ళముందే నా భార్య మర్మావయవాల్లో కత్తులుదించారు. నా కూతుర్ని దారుణంగా చెరచి ఆమె స్థనాలు కోసిపారేశారు.

వారంతా రక్తపు మడుగుల్లో కొట్టుకుంటూ పెట్టిన పెడబొబ్బలూ, చేసిన హాహాకారాలూ, చూసిన చూపులూ... నా గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్దలైనై. అవిప్పటికీ నాకళ్ళముందు సినిమా రీళ్ళలా తిరుగుతున్నై.

పారిపోయివస్తూ వెనక్కు తిరిగిచూస్తే- నా ఇంట్లోంచి మంటలు లేస్తున్నై.

ఢిల్లీ పేవ్‌మెంట్ల మీద రెండునెలలు దుర్భర జీవితం గడిపాను. ఈ ఊరు గురించీ, ఈ భోగేశ్వరాలయం గురించీ మా తాతా, నాన్నా చెప్పేవారు. రైలెక్కి కాజీపేటలో దిగాను. ఇటువైపొస్తున్న ఓ లారీ డ్రైవర్ని బ్రతిమాలి ఇక్కడ దిగాను....

అతని కళ్ళల్లోని విషాద రేఖలు మమ్మల్ని కదిలించినై. మా కడుపుల్లో దేవినట్లైంది. రక్తం సలసల కాగింది.

"ఐతే... ఏదన్నా కష్టం జేసుకొని బతకొచ్చు గదా! ఎందుకా పిచ్చినటన?" అడిగాడు మనోహర్.

"నా సత్తువంతా ఢిల్లీ ఉపవాసాల్లో కరిగిపోయింది. క్షణక్షణం నా భార్యాబిడ్డలు గుర్తుకొస్తే నాకు పిచ్చెక్కిపోతుంది. నా ఒక్క జానెడు పొట్టకు హోటల్ యజమానులు వేసే ముద్ద సరిపోతుంది. మీరీ రహస్యాన్ని బయట పెడితే నాగతి అధోగతే బాబూ! రెండు చేతులెత్తి నమస్కరించాడు.

★ ★ ★


మూణ్ణెళ్ళ ట్రైనింగ్ పూర్తయి రెక్కలు కట్టుకుని ఇంట్లో వాలాను.

"ఆ మిత్ర ద్రోహి రామారావు గాడెప్పుడన్నా ఇటువైపొచ్చాడా? వెధవ నేను వెళ్ళగానే ఒకే ఒక ఉత్తరం రాసి ఊరుకున్నాడు. నేనెన్ని ఉత్తరాలు రాసినా జవాబివ్వలేదు. అసలు వాడికేమైందటా?" భోంచేస్తూ అడిగాను శ్రీమతిని.

"దొంగనోట్ల మార్పిడీకేసులో రామారావన్నయ్య హస్తముందని పోలీసులు అరెస్టు చేశారండీ." చారు వడ్డిస్తూ చెప్తూంది మనోరమ.

"వాడెవరో సి.ఐ.డి. ఆఫీసర్ రఘువీరటా... పిచ్చోడివేషంలో తిరుగుతూ పట్టేశాడటా. అన్నట్టూ... భోగేశుని గుళ్ళో జంటహత్యలు జేసిన దోషుల్ని గూడా వాడే పట్టాడ టండీ. వాడెంత తెలివైనవాడో..."

★




సర్కార్, కార్టూనిస్ట్, ఇ.నం.46-9-64, దొండపర్తి బజార్ వీధి, విశాఖపట్నం-530 016.